కలగానే బ్యాంకు సేవలు

- జక్కంపూడి కాలనీ వాసులకు అందని ద్రాక్షలా బ్యాంక్ సదుపాయం
- బ్యాంక్ పని ఉంటే.. సెలవు పెట్టాల్సిందే!

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి కాలనీ...నగరంలోని పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వేలాది మంది ప్రజలకు ప్రభుత్వం పునరావాసం కల్పించిన ప్రాంతం...విజయవాడ రూరల్ పరిధికి, నగరానికి కూతవేటు దూరంలో ఉన్న జక్కంపూడికాలనీలో తగిన బ్యాంకు సదుపాయం లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో 250కి పైగా బ్లాకులు , 8 వేలు ప్లాట్లు ఉండగా, అందులో సుమారు 30వేల మంది నివాసం ఉంటున్నారు. సాధారణంగా నగరంలో ప్రతి డివిజన్‌లో ప్రభుత్వ రంగ బ్యాంకులు రెండు మూడు ఉంటే.. వేలాది కుటుంబాలు ఉంటున్న జక్కంపూడి కాలనీలో మాత్రం ఒక్క ప్రభుత్వ రంగబ్యాంక్ కూడా అందుబాటులో లేదు. దీంతో కాలనీవాసులు గతంలో వారు నివాసం ఉన్న ప్రాంతాలకు వెళ్లి బ్యాంక్ సేవలను పొందాల్సి దుస్థితి ఏర్పడింది.



జక్కంపూడి కాలనీ

అవస్థల్లో డ్వాక్రా సభ్యులు..

భవానీపురం, కబేళా, సితారా, కృష్ణలంక, పాయకాపురంతోపాటు నగరంలోని కాల్వగట్ల వెంబడి నివసించే అనేక కుటుంబాలకు జక్కంపూడి కాలనీలో ఇళ్లు కేటాయించడంతో వారు కొన్నేళ్లుగా ఇక్కడ ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి సాయమైనా.. డ్వాక్రా పొదుపు సంఘాలైనా సభ్యులైనా గతంలో వారు నివాసం ఉన్న ప్రాంతాల్లోని బ్యాంకులకు వెళ్లక తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మూడేళ్ల కిందట కాలనీ ప్రధాన రహదారిలో ఓ గ్రామీణ బ్యాంక్ ఏర్పాటు ద్వారా కొంత మేర సేవలు అందుతున్నప్పటికీ జాతీయబ్యాంకు సేవలు తమకు అందని ద్రాక్షలా మారాయని కాలనీవాసులు చెబుతున్నారు.

బ్యాంక్‌కు వెళ్లాలంటే ఓ పూట సెలవే...!

కాలనీలో నివసించేవారిలో అత్యధికులు దుకాణాల్లో పనిచేసే వారు, ఆటో కార్మికులు, చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు ఉన్నారు. ఆయా ప్రైవేట్ సంస్థలు, దుకాణాల్లో పనిచేసేవారికి యాజమాన్యాలు వేతనాలను బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తుంటాయి. ఆయా బ్యాంకు ఖాతాల నుంచి నేరుగా నగదు డ్రా చేసుకోవాలంటే బ్యాంకు ఖాతా ఉన్నచోటకే వెళ్లాల్సి వస్తోంది. ఇక పొదుపు సంఘాల మహిళలు బ్యాంక్ నుంచి రుణాలు పొందాలన్నా, తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలన్నా సుదూరంగా ఉన్న ఆయా బ్యాంకులకు వెళ్లేందుకు అనేక వ్యయప్రయాసాలు పడుతున్నారు. ఇలా ఖాతాలు ఉన్న బ్యాంకుకే వెళ్లాలంటే మాత్రం ఓ పూట సెలవు తీసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

కనిపించని ఏటీఎం

కాలనీలో ఒక్కటంటే ఒక్క ఏటీఎం సదుపాయం లేకపోవడంతో ఇతరప్రాంతాల్లోని ప్రైవేట్ బ్యాంకుల ఏటీఎంలే దిక్కవుతున్నాయి. ప్రయివేటు బ్యాంకుల నుంచి నగదును తీసుకుంటే అధిక మొత్తంలో ఛార్జీలు పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు, వ్యాపార సంస్థల్లో జరిగిన లావాదేవీలలో వచ్చిన నగదును కౌంటర్‌లోనే ఉంచితే దొంగలబారిన పడుతున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బు డ్రాకు ప్రైవేటు వ్యక్తులే దిక్కు..

బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులను అవసరానికి తీసుకోవాలంటే కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంక్‌కు వెళ్లలేక... కాలనీలో వున్న ప్రైవేటు వ్యక్తులు, దుకాణాలల్లో ఫోన్‌పే వంటి యాప్‌ల ద్వారా డబ్బులు తీసుకోవాల్సి వస్తుంది. దీనికి అవసరాన్ని బట్టి వెయ్యికి రూ.10 నుంచి రూ. 20ల వరకు చార్జీలు చెల్లిస్తున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో వరద నీటిలో కాలనీ పూర్తిగా మునిగిపోగా, ప్రభుత్వం సాయం అందించింది. అయితే ప్రభుత్వం అందించిన సాయం నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ కావడంతో ఆ డబ్బులు తీసుకునేందుకు పనులు మానుకుని బ్యాంకుల చుట్టూ తిరిగాల్సి వచ్చిందని కాలనీవాసులు గుర్తు చేసుకుంటున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి కాలనీలోనే ఆయా జాతీయబ్యాంకుల బ్రాంచీలు ఏర్పాటయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని జక్కంపూడి కాలనీవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పక్కా డ్రెయిన్ నిర్మించాలని ఆదేశం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులోని నాగయ్య హోటల్ సెంటర్‌లో డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని కమిషనర్ ధ్యాన్యచంద్ర ఆదేశించారు. ఆయన సోమవారం 40వ డివిజన్‌లో పర్యటించారు. నాగయ్య హోటల్ సెంటర్‌లోని కచ్చా డ్రెయిన్ పొంగిపొర్లి రోడ్డుపై ప్రవహిస్తుండటాన్ని ఆయన గమనించారు. పక్కా డ్రెయిన్ నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని కరకట్ట సౌత్ రోడ్డులో గత పుష్కరాలకు నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారిన వైనంపై సిబ్బందిని ప్రశ్నించారు. ఈనెల 21నుంచి భవానీ దీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పున్నమి, భవానీ ఘాట్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లను శుభ్రం చేసి వారికి అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ శివరామప్రసాద్, ఇంజినీరింగ్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఏలూర జిల్లా కై కలూరుకు చెందిన శ్యామల నాట్య కళా అకాడమికి చెందిన కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో నృత్య నీరాజనాలర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గురువులు కె.లక్ష్మీజ్యోతి పర్యవేక్షణలో 13మంది శిష్యబృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్యప్రదర్శన ద్వారా నీరాజనాలర్పించారు. అనంతరం శిష్యబృందంను ఆలయ ఈవో కెఎస్. రామరావు అభినందించి అమ్మవారి ప్రసాదాలు, దేవస్థాన ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆలయ మర్యాదలతో శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన వినియోగదారుల అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి విద్యార్థులకు వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై ఉండాల్సిన ఆవశ్యకతను వివరించారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఇందుకు ఇటువంటి కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. కన్స్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నవీన మాట్లాడుతూ వినియోగదారు అవగాహన వారోత్సవాల్లో విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తూనికలు కొలతల విభాగం అధికారులు విద్యార్థులకు సరైన తూనికలు కొలతలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సుధాకరరావు, రామకృష్ణ, అప్పారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ట్యూషన్ ఫీజు గడువు పొడిగింపు

చివరి తేదీ ఈనెల 28

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, డిగ్రీ, పీజీ ట్యూషన్ ఫీజు గడువు ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు వర్సిటీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంతకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈనెల 28వ తేదీలోపు ఏపీ ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం ప్రతీ విద్యార్థి ఏబీసీ ఐడి క్రియేట్ చేసుకోవాలని సూచించారు. ఐడీ ద్వారా యూనివర్సిటీ నుంచి ప్రతి సమాచారం విద్యార్థులకు లభిస్తుందన్నారు. తప్పనిసరిగా ఏబీసీ ఐడీ రిజిస్టర్‌చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో స్వయంగా కానీ 0866-2434868 ఫోన్ నంబర్‌లో కానీ సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

దీక్షాధారులకు అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): శ్రీసాయి మణికంఠ భక్త బృందం అగురు త్రినాథ్ గురుస్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు, భవానీలకు పాయకాపురం రాధానగర్‌లో సోమవారం అన్నదానం చేశారు. గురుదేవులు తుంపాల నాగేశ్వరరావు దివ్య ఆశీస్సులతో 2006 నుంచి స్వాములు, భవానీలకు ఇలా అన్న, ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

డీసీపీ ఉదయరాణి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా మొత్తం 73 ఫిర్యాదులను స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి బాధితుల నుంచి స్వీకరించిన 73 ఫిర్యాదులపై వారితో మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధులు వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో మాట్లాడారు. నగదు లావాదేవీలకు సంబంధించి 20, భార్యాభర్తలు, కుటుంబ కలహాలు 10, మహిళా నేరాలు6, భూవివాదాలపై 19, వివిధ మోసాలు 8, ఇతర చిన్న చిన్న వివాదాలు, సమస్యలు, సంఘటనలకు సంబంధించి 10 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాపు



మాట్లాడుతున్న సీహెచ్ రామకృష్ణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఆయా రంగాల్లో వస్తున్న నూతన అంశాలపై పట్టు సాధించినప్పుడే మరిన్ని విజయాలను సాధిస్తారని ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ సీహెచ్ రామకృష్ణ పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో క్లౌడ్ కంప్యూటింగ్‌పై ఆరురోజుల వర్క్‌షాప్‌ను కళాశాలలో సోమవారం ప్రారంభించారు. రామకృష్ణ మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్ 200కి పైగా సేవలను అందిస్తోందన్నారు. స్టార్టప్‌లు, అతి పెద్ద ఎంటర్‌ప్రైజెస్, ప్రభుత్వసంస్థలతో సహా మిలియన్ల మంది వినియోగదారులు ఖర్చులను తగ్గించుకునేందుకు క్లౌడ్ కంప్యూటింగ్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శర్వాణ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటన బందోబస్తుపై దిశానిర్దేశం



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత రాష్ట్రపతి ముర్ము పర్యటన సందర్భంగా బందోబస్తు విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎన్టీఆర్ జిల్లా నగర పోలీస్ కమిషనర్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో మంగళవారం జరుగనున్న ప్రథమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ముర్ము ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో స్థానిక సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ రాష్ట్రపతి ముర్ము తన పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో దిగి అక్కడ నుంచి రోడ్ మార్గాన విజయవాడ మీదుగా మంగళగిరి ఎయిమ్స్‌కు చేరుకుంటారన్నారు. సాయంత్రం కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి విజయవాడ మీదుగా గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని వివరించారు. ఈ క్రమంలో గూడవల్లి నుంచి వారధి వరకు సుమారు 16కిలోమీటర్ల మేర రూట్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బందోబస్తులో పాల్గొనే అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన విధులను అంకిత భావంతో నిర్వర్తించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది వారికి కేటాయించిన పాయింట్లలో అప్రమత్తంగా ఉండాలని, ఇతరులు వెళ్లాల్సిన మార్గాలపై వారికి సూచనలివ్వాలన్నారు. వాహనాలు ఎక్కడైనా బ్రేక్ డౌన్ అయితే కంట్రోల్ రూమ్‌కుగానీ, పైఅధికారులకుగానీ వెంటనే సమాచారం అందించాలన్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా..ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని పోలీసుసిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు కె.ఉమామహేశ్వర రాజు, ఏబీటీఎస్ ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఎస్‌వీడీ ప్రసాద్, ఏడీసీపీలు ఎం.రాజారావు, ఏవీఎల్ ప్రసన్నకుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వాయర్‌ను అందుబాటులోకి తేవాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



రిజర్వాయర్‌ను పరిశీలించి వస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి

సాక్షి ఎఫెక్ట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): మంచినీటి రిజర్వాయర్ ప్రారంభోత్సవానికి త్వరితగతిన ఏర్పాట్లు చేయడం ద్వారా రిజర్వాయర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎమ్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. భవానీపురం 40వ డివిజన్ పరిధిలోని లారీస్టాండ్‌లో రూ.3.30కోట్లతో 1500 కిలో లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన మంచినీటి రిజర్వాయర్ పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోని వైనంపై 'రిజర్వాయర్ వినియోగంలోకి వచ్చేదెన్నడో?' శీర్షికన ఈనెల 15వతేదీన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి వీఎంసీ కమిషనర్ స్పందించారు. కమిషనర్ సోమవారం ఉదయం స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, అధికారులతో కలిసి లారీ స్టాండ్‌లోని నూతన మంచినీటి రిజర్వాయర్‌ను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్‌ను త్వరితగతిన ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రిజర్వాయర్ ఆవరణలోని శానిటరీ కార్యాలయంలో మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



పంచముఖ ఆంజనేయ స్వామి, గోదాదేవికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయపరిధిలోని పంచముఖ ఆంజనేయ స్వామివారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున స్వామివారికి తిరుప్పావై సేవ నిర్వహించారు. గణపతి పూజ అనంతరంస్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. విశేష అభిషేకాల అనంతరం అలంకరణ, నాగవల్లితోసహస్ర నామార్చన జరిగాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. రామలింగేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

వెంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో...

చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం గోదాదేవి అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పంచామృత అభిషేకాల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు గణపతి పూజ, కలశస్థాపనతో ధనుర్మాస ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి విశేష అభిషేకాన్ని వీక్షించేందుకు పెద్దఎత్తున భక్తజనం ఆలయానికి తరలివచ్చారు. పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీహనుమత్ దీక్షా పీఠంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అభయ వీరాంజనేయస్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు.

రవాణా రంగ పరిరక్షణకు పోరాటం

8, 9 తేదీల్లో ఏఐఆర్ డబ్ల్యూఎఫ్ అఖిల భారత సమావేశాలు



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రవాణా రంగ పరిరక్షణ – సంక్షేమబోర్డు సాధనకు వచ్చేనెల 8, 9 తేదీల్లో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఏఐఆర్ డబ్ల్యూఎఫ్ అఖిల భారత సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎ.ఐ.ఆర్.టి. డబ్ల్యూ.ఎఫ్. అఖిల భారత కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తెలిపారు. దుర్గాపురం రజకవీధిలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏఐఆర్ డబ్ల్యూఎఫ్ అఖిల భారత సమావేశాలు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు రవాణా రంగ రక్షణ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బీఎన్ఎస్ – 106 చట్టంలో డ్రైవర్లను హంతకుల కింద శిక్షలు విధించే సెక్షన్‌ను తొలగించాలని, ట్రక్ గూడ్స్ భారాలను తగ్గించాలని, రోడ్డు రవాణా కార్మికులందరికీ సామాజిక సంక్షేమ చట్టం అమలు చేయాలనే డిమాండ్‌లతో పోరాటాన్ని ఉధృతం చేయడానికి సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికల్ ఎమెండ్మెంట్ యాక్ట్ 2019 ద్వారా యాగ్రిగ్రేటర్స్‌కు అవకాశం కల్పించారన్నారు. ఫలితంగా విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు ట్రాన్స్‌పోర్టు రంగంలో ప్రవేశం కల్పించడం ద్వారా దేశీయంగా ఉపాధి పొందుతున్న వారు నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. 300 రెట్లు చలానాలు, జరిమానాల చార్జీలు పెంచారన్నారు. పెట్రోలు, డీజిల్, టోల్‌గేట్ చార్జీలను విచ్చల విడిగా పెంచుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి పోరాటం ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎ.ఐ.ఆర్.టి.డబ్ల్యూ.ఎఫ్. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శివాజీ, ముజఫర్ అహమ్మద్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుందరయ్య, ఎం.అయ్యప్పరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి తండులాభిషేకం



బియ్యంతో అన్నపూర్ణదేవికి అభిషేకం చేసిన దృశ్యం



108 పూర్ణకుంభాలతో పూజలు చేస్తున్న అర్చకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ద్వారావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకాశీ అన్నపూర్ణ అమ్మవారికి 12,108 కిలోల బియ్యంతో చేసిన తండులాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. పాతబస్తీలోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 14న ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు సమర్పించిన బియ్యంతో మూడురోజులుగా అభిషేకం చేయడంతోపాటు పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. లోకకల్యాణార్థం లక్ష్మీనారాయణ, శివపార్వతుల కల్యాణోత్సవాలతోపాటు స్వామివార్లకు విశేష పూజలు చేశారు. సోమవారం సాయంత్రం 108మంది ముత్తయిదువులతో అమ్మవారికి పూర్ణకుంభ హారతి ఇచ్చారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 12108 కిలోల బియ్యంతో అన్నపూర్ణాదేవికి అభిషేకం చేయడం మహత్తర కార్యక్రమంగా భావిస్తూ ఏటా కొనసాగిస్తున్నామన్నారు. వచ్చిన బియ్యంతో ఏటా అన్నదాన కార్యక్రమాలను ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను తమ సంస్థ నిర్వహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పసలేని ప్రభుత్వ వాదనలతోనే జీఓ నంబరు 56 కొట్టివేత

దాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): హైకోర్టు ముందు పసలేని ప్రభుత్వ వాదనల వల్ల జీఓ 56ను హైకోర్టు కొట్టివేసిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగ రాధా కృష్ణ యాదవ్ అన్నారు. స్థానిక ముత్యాలంపాడులో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 56 ముఖ్య ఉద్దేశాన్ని, దానివల్ల విద్యార్థులకు జరిగే మంచిని రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విస్మరించడం , కోర్టు ముందు బలమైన వాదనలు వినిపించకపోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వ తీరు వల్ల ఔత్సాహిక వైద్య విద్యార్థులకు నష్టాన్ని కలిగిస్తూ ప్రైవేట్ వైద్య కళాశాలలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉందన్నారు. గత టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 మధ్య కాలంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజులు 200 శాతం పెరిగాయని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందరికీ న్యాయమైన అవకాశాలను అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ సిఫార్సులను అనుసరించి జీఓ 56ను ప్రవేశపెట్టిందన్నారు. జీఓ 56ను కొట్టివేయటం వల్ల చాలా మందికి, ముఖ్యంగా వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి వైద్య విద్యను భరించలేని విధంగా, ఫీజుల పెంపు మరలా దాపురించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో 56ను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల నుంచి విద్యార్థుల దోపిడీని నిరోధించి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ మార్గదర్శకాలతో సామాజిక న్యాయం సమానత్వ సూత్రాలను వైద్య విద్యలో ప్రభుత్వం . పునరుద్ధరించాలని కోరారు.

నేడు సిద్ధార్థలో చిత్రలేఖనం పోటీలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ కళాశాల, ఏపీ ఇంధన పరిరక్షణ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం .రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాల (6 నుంచి 10వ తరగతి), కళాశాల స్థాయి (ఇంటర్, డిగ్రీ) విద్యార్థులకు వేర్వరు విభాగాలుగా పోటీలు తమ కళాశాల ఆవరణలో జరుగుతాయని పేర్కొన్నారు. రీసైక్లింగ్ ఎనర్జీ ఫ్రం ఎవ్రీడే యాక్టివిటీస్, ది ఎర్త్ విథౌట్ ఫాజిల్ ఫ్యూయల్స్ అంశాలపై పోటీలు జరుగుతాయని వివరించారు. పోటీలను కళాశాల ఇంధన పరిరక్షణ, హరిత, సైకిలింగ్, భౌతికశాస్త్ర, వృక్షశాస్త్ర విభాగాల పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. విజేతలకు బహుమతులు, పోటీల్లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామని రమేష్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ప్రజలకు సంతృప్తికర పరిష్కారానికి చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



సర్కిల్-3 కార్యాలయంలో నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు సంతృప్తికర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ . ధ్యానచంద్ర అన్నారు. పటమటలోని సర్కిల్ -3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమానికి హాజరై ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును శాఖాధిపతులు కచ్చితంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి సమస్యను అర్థం చేసుకుని పరిష్కరించిన తర్వాత ఫొటో జత చేయాలన్నారు. సర్కిల్ 3 కార్యాలయంలో మొత్తం ఆరు ఫిర్యాదులు అందగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సర్కిల్ 1, 2, వీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదులను కమిషనర్ పరిశీలించారు. ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 11 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. అందులో అత్యధికంగా పట్టణ ప్రణాళిక విభాగంలో ఏడు ఉండగా, ఇంజనీరింగ్ సంబంధించి 2, ప్రజారోగ్యం, రెవెన్యూ విభాగంలో ఒక ఫిర్యాదును అధికారులు అందుకున్నారు. జోనల్ కమిషనర్-3 ఇన్‌చార్జ్ ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ కమిషనర్ రెవెన్యూ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

27న నగరానికి గణపతి సచ్చిదానందస్వామి

పటమట(విజయవాడతూర్పు): గణపతి సచ్చిదానందస్వామి ఈ నెల 27వ విజయవాడ రానున్నారు. ఈ మేరకు పటమట దత్తపీఠం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ మహాశివరాత్రి వరకు ఆయన ఆంధ్రాలోని వివిధ ప్రాంతాల్లోని దత్తక్షేత్రాలు, దత్తాశ్రమాల్లో ఉంటారని పీఠం నిర్వాహకులు ప్రకటించారు.